# గురు దక్షిణ

ఉదయం పేపరు కుర్రాడు పేపరు విసిరేసి వెళ్ళాడు. దాన్నందుకుని సోఫాలో కూల బడ్డాను.

అప్పుడొచ్చాడు – రాంబాబు. "గురూ గారున్నారా?" అంటూ. వేగంగా నా గదిలోకి దూసుకొచ్చి, నన్ను చూసి, "నమస్కారం గురూగారూ!" అంటూ నా ఎదురుగా కుర్చీ లాక్కుని అందులో నిట్టూరుస్తూ కూర్చున్నాడు. శ్రీమతి తెచ్చిన కాఫీ యింకా సెగలు కక్కుతూ టేబిలు మీదే వుంది. పలకరింపుగా అతని వేపు చూసి నవ్వేను. రాంబాబు నవ్వ లేదు. అతని ముఖం ఎందుకో అప్రసన్నంగా ఉంది. ఎవరి మీదో కోపంగా ఉన్నాడని తెలుస్తూనే ఉంది. దివాళాకోరు ముఖం పెట్టేడు. కుర్చీలో కొంచెం అసహనంగా కదిలి, మరో సారి నిట్టూర్చాడు. అతని దృష్టి కాఫీ కప్పు మీద పడింది. "క్షమించండి గురూగారూ, తల ఒక్కలా బద్దలై పోతోంది..." అని ఆ కాఫీ కప్పు అందుకున్నాడు. కాఫీ చప్పరిస్తూ లోపలి గదిలోకి వినబడే లాగున కేక వేసాడు: "ఏవండోయ్! ప్రభావతి అక్కయ్య గారూ! మా గురూ గారికి మరో కప్పు కాఫీ పట్రండి..." అని. అతను మా యింటి కొస్తే నాకు – నేను మరెవరి యింట్లోనో ఉన్నట్టుగా ఉంటుంది. కొంచెం యిబ్బందిగా కదిలేను. కానీ అతనదేం పట్టించుకో లేదు. కాఫీ తాగడం పూర్తి చేసాక, "మోసం గురూ గారూ, మోసం!... అంతా దగా. కుట్ర... వంచన... లోకం దగాకోరు తనంతో మండి పోతోంది..." అన్నాడు భారంగా. ఆ మాటలన్నాక, నా రియాక్షన్ ఎలా ఉంటుందో పరిశీలిస్తున్నట్టుగా నా ముఖం లోకి తేరిపార చూసేడు.

ఎక్కడో గట్టి దెబ్బ తినీసి నట్టున్నాడు. మనిషి వొట్టి దూకుడు. ముందూ వెనుకా చూడదు. పెద్దంత్రం, చిన్నంత్రం లేదు. ఏ వ్యవహారంలోనో గట్టి కాజా తినీసేడు కాబోలు. నా ముఖంలో తను ఆశించిన సానుభూతి వ్యక్తం కాలేదేమో, – హు! అని నిట్టూర్చాడు. "మోసం గురూ గారూ! మోసం! లోకమంతా దగుల్బాజీలతో నిండి పోయింది. ఒకడ్నొకడు తినీడవే! – ఛ!" అని విసుక్కున్నాడు.

ఏదో పెద్ద కథలాగే ఉందనుకున్నాను.

"ఏమైంది రాంబాబూ?" అడిగేను. అతన్నలా సంబోధించే చనువు అతనే నాకిచ్చాడు. "గురూ గారూ, మీరు పెద్దలు, పూజ్యులు... కథలూ గట్రా రాస్తారు... మీకు లోకం సంగతీ మనుషుల సంగతీ తెలుస్తుంది. మరందు చేత మీ మాట నాకు శిరోధార్యం. మీరు నన్ను మన్నిస్తూ సంబోధించ వద్దు. ఏక వచనంతోనే పిలవండి. ఏమనుకోను. పైపెచ్చు సంతోషిస్తాను కూడా! నా తప్పుల్ని ఎత్తి చూపాలి. 'రాంబాబూ, యిది తప్పయ్యా,

నా కసహ్యం. నీ పద్ధతి మార్చుకో.' అని నిక్కచ్చిగా చెప్పాలి. నా హితవు కోరేది మీరే అని నా నమ్మకం. మీరు నన్ను 'గారూ' 'అండీ' అని మన్నించ కండి. ముందే చెబుతున్నాను. నేను మాత్రం మిమ్మల్నెపుడూ 'గురూ గారూ!' అనే పిలుచుకుంటాను. మీరు కాదన కూడదు." అంటూ మా పరిచయమైన కొత్తలో ఓ చిన్న సైజు లెక్చరిచ్చాడు. అతని మాటలకి పొంగి పోయి కాదు కానీ, అతను పట్టిన పట్టు విడువడనిపించి, అతన్తో చనువు పెంచుకోసాగేను. మంచీ, చెడ్డా, కష్టం, సుఖం నాతో చెప్పుకుంటూ ఉంటాడు. తోచిన సలహాలివ్వడం నా పని. నా సలహాలు,సూచనలు తు.చ. తప్పక పాటిస్తున్నాడో లేదో చెప్పడం కష్టం. ఎందు చేతనంటే, అంత సులభంగా ఒకరికి లొంగే ఘటం కాదు. అందు చేతనే యిప్పుడతని పట్ల అంత ఆసక్తి చూపించ లేక పోయేను.

రాంబాబు ఓ క్షణం సేపు మాట్లాడ లేదు.

ఇంతలో ప్రభ కాఫీ తెచ్చింది. కాఫీ నాకందిస్తూ రాంబాబుని పలకరించింది. "రండ్రండి... మీరూ కూచోండి... చాలా విషయాలు చెప్పాలి. మోసం అండీ ...అంతా మోసం! లోకమంతా మోసగాళ్ళే. అవునంటారా? కాదంటారా?" అంటూ ఆమె ఎదుట మళ్ళీ పాత పాటే పాడాడు. కబుర్లు చెప్తూ కూచోడానికి ఆవిడకంత తీరిక లేదు. కానీ అతని మాటలకి నవ్వొచ్చి ఫకాలున నవ్వింది. "అంత కష్టం ఏమొచ్చిందండీ రాంబాబు గారూ!" అంది నవ్వు ఆపుకోడానికి ప్రయత్నిస్తూ. "ఆ సుబ్రహ్మణ్యం గారి బంధువుల సంబంధం చేసుకోక తప్పేలాలేదు–" షేం ఆశ్చర్యంగా అతని వేపు చూసేం. "పిల్ల నచ్చ లేదా?" అడిగేను. "పిల్ల నచ్చిందా, లేదా అన్నది కాదు ప్రశ్న." "మరి వాళ్ళిస్తామన్న కట్నం నచ్చ లేదేమిటండీ..." ప్రభావతికి కొంచెం పెంకెతనం జాస్తి. "కట్నం నచ్చిందా లేదా అన్నది కాదు ప్రశ్న" "మరి లాంఛనాలూ అవీ..." నసిగేను అనుమానంగా. "లాంఛనాలూ అవీ నచ్చేయా లేదా అన్నది కాదు ప్రశ్న..." అంటూ ముసి ముసిగా నవ్వింది ప్రభావతి. రాంబాబు ఆమె వేపు ఉడుక్కుంటున్నట్టుగా చూసేడు. కొంచెం ఏడుపు ముఖం కూడా పెట్టేడు. "మీకు వెటకారంగా ఉంది... పెద్ద మోసానికి గురై నేను నా అవస్థకి ఏడుస్తూ వుంటే మీకు నవ్వులాటగా ఉంది... ఏం చేస్తాం లెండి... నా తల రాత అలా తగలడింది మరి..." అన్నాడు దీనంగా.

నేను మందలింపుగా ప్రభావతి వేపు చూసేను. ఆమె కూడా నొచ్చుకుని, "అది కాదండీ రాంబాబు గారూ!... పిల్ల నచ్చింది. కట్నం బాగానే యిస్తారు. లాంఛనాలూ అవీ బాగానే జరిపిస్తారు. జాతకాలు భేషుగ్గా కుదిరాయి ... మరింక ఆ పిల్లని చేసుకోడానికి మీకున్న అభ్యంతరమేవిటండీ?" అంది. "మీకర్థం కాదు లెండి... చెప్పినా అర్థం చేసుకో లేరు. కనీసం అందుకు ప్రయత్నించరు..." విసుగు ధ్వనింపజేస్తూ నిష్ఠురమాడేడు రాంబాబు.

"అది కాదు. నువ్వు ఏ సంగతీ సరిగా చెప్పక పోతే మాకు ఎలా తెలుస్తుంది చెప్పు!" అన్నాను. "చెప్పడానికేముంది గురూ గారూ! ఆ పిల్లని నేను చేసుకోక తప్పేలా లేదు" మళ్ళీ అదే పాట! నీరసంగా, నిరాశగా, చికాగ్గా, దిగులుగా.

ఈ మనిషి మాటల్లోనే యిన్ని మెలికెలున్నాయి. ఇంక మనసులో ఎన్ని మెలికలున్నాయో! ప్రభావతి అతనింక చెప్పేదేమీ లేదని గ్రహించిన దానిలా లోపలికి వెళ్ళడానికి సిద్ధ పడింది. "మరయితే, సుబ్రహ్మణ్యం గారికి ఏం చెప్ప దలుచుకున్నావ్" సూటిగానే అడిగేసాను. "ఏదో చెప్తాను. ఆ పిల్లని పెళ్ళాడక ఛస్తానా!... వాడొక బద్మాష్. రోగ్. లుచ్చా... పక్కా మోస గాడు..." సుబ్రహ్మణ్యం గారి మీద కారాలూ మిరియాలూ నూరు తున్నాడు రాంబాబు. అలా తిడుతూనే, మాతో ఏ విషయమూ చెప్పకుండానే "వస్తాను గురూ గారూ!.. ఆ సుబ్రమణ్యం గాడితో ఆ సంబంధం ఖాయం చేసెయ్యమని మీరే చెప్పండి.. నేనిలా వాడిని తిట్టినట్టు మాత్రం వాడితో అనకండి ..." అంటూ వెళ్ళిపోయేడు. అసలెందుకొచ్చినట్టు? ఎందుకు వెళ్ళి నట్టు! చిత్రమైన మనిషి!

* * *

రాంబాబుకి పెళ్ళి నిశ్చయమైంది. సుబ్రహ్మణ్యం తెచ్చిన సంబంధమే. వాళ్ళ బంధువుల పిల్లట. పేరు కల్యాణి. పెళ్ళి ముహూర్తాలు నిర్ణయించుకున్నాక మా యింటి కొచ్చేడు రాంబాబు. అతని ముఖం మునపటి లాగే విచారంగా ఉంది. పెళ్ళి కళ లేదు! నాకూ ప్రభావతికీ జాలేసింది. అంత యిష్టం లేని పెళ్ళికి అతనెందుకు ఒప్పుకున్నాడు? వద్దని ఒక్క మాట చెప్పేస్తే సరిపోదూ! పోనీ, తల్లిదండ్రుల బలవంతం మీద ఒప్పుకున్నాడా అంటే అదీ కాదు. వాళ్ళకి ఈ సంబంధం చేసుకోవడం మొదటి నుండీ యిష్టం లేదు. రాంబాబే యీ సంబంధం కుదిర్చే వరకూ యింట్లో ఒకటే పోరు పెట్టేడు. తీరా యిప్పుడిలా మాట్లాడుతున్నాడు. ఏదో కారణం ఉండే ఉంటుంది. అడిగితే చెప్పే రకం కాదు. తప్పని సరైన పరిస్థితులలో అతనీ పెళ్ళికి ఒప్పుకున్నట్టుగా ఉంది. అంత బలవత్తరమైన సంఘటన ఏం జరిగి ఉంటుంది! ఈ చిక్కు ముడి విప్ప గలిగేది సుబ్రహ్మణ్యం గారే అనిపించింది. ఒక వేళ రాంబాబు ఎవరి ఒత్తిడికయినా లొంగి పోయి యిందుకు అంగీకరిస్తూ వుంటే, అతని హితైషిగా ఆ సమస్యని పరిష్కరించడం మిత్రునిగా కూడా నా కనీస ధర్మం. అన్ని విషయాలూ నాతో చెప్పుకునే రాంబాబు ఈ విషయంలో మాత్రం నాతో ఒక్క మాట కూడా చెప్పక పోవడం చిత్రం! ఏమైనా సుబ్రహ్మణ్యం గారిని కలవడానికే నిశ్చయించుకున్నాను. అతను యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆఫీసులో పని చేస్తున్నాడు. అతనితో నా పరిచయం రాంబాబు వల్లనే కలిగింది. ఓ ఆదివారం పని గట్టుకుని సుబ్రహ్మణ్యం గారింటికి వెళ్ళాను. అతను నారాకను చూసి, సంతోషంగా పలకరించేడు. సాదరంగానే ఆహ్వానించేడు. మామూలు పలకరింపులు అయేక, రాంబాబు విషయం కదిపాను.

ఆయన నా వేపు సాలోచనగా చూసి – "ఇంతకీ అతనికి పిల్ల నచ్చ లేదని చెప్పాడా?" అడిగాడు. "ఉహూ... అదేం కాదు... కాని ఎటూ బయట పడడం లేదు." "అంటే?" "మరేం లేదు. పిల్ల నచ్చడం వగైరా విషయాలలో అతనేమీ మాట్లాడడం లేదు. కాని, ఎందు చేతనో యేమో, అతనీ సంబంధాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాడనిపిస్తోంది..."

"పోనీ, మానెయ్యమనండి"

"నిశ్చయం చేసుకున్న పెళ్ళి కదా!"

"అయితే పెళ్ళి చేసుకుంటాడు. దానికేం!" అన్నాడతను కొంచెం నిర్లక్ష్యంగా. ఆకుకీ పోకకీ అందడం లేదు మా సంభాషణ. "అది కాదండీ... నచ్చని సంబంధం చేసుకుంటే జీవితాంతం అతను వ్యథతో కుంగి పోవాల్సి వస్తుంది కదా? ప్రతీ దానికీ ఏదో మోసం, మోసం అంటున్నాడు. వివరాలు మీకేమయినా తెలుసేమోనని అడగడానికొచ్చేను." నా మాటలు విని సుబ్రహ్మణ్యం ముఖం కోపంతో ఎర్రబడి పోవడం గమనించేను. అతని దవడ కండరాలు బిగుసుకున్నాయి. కొంచెం అసహనంగా కుర్చీలో కదిలేడు. "మీతో చెప్పనిది నాతో మాత్రం చెప్తాడని ఎలా అనుకుంటున్నారు?" సూటిగా నా వేపు చూస్తూ అడిగేడు. "మరేం లేదు. సూటిగా ఉన్న విషయం చెబుతున్నందుకు మన్నించాలి. వాడెందుకో పదే పదే మిమ్మల్ని తిట్టి పోస్తున్నాడు...." సుబ్రహ్మణ్యం పిడికిలి బిగుసుకుంది. ఆవేశంతో అతని శరీరం సన్నగా వణకడం గుర్తించేను. ఓ క్షణం యిద్దరం మాట్లాడుకో లేదు. ఉన్నట్టుండి అతనే అన్నాడు.

"మీరు అతని గురించి యింతగా వర్రీ అవుతున్నారు కనుక మీకు అసలు విషయం చెప్తే తప్పు లేదనిపిస్తోంది. చూడండి... రాంబాబుకి సంబంధించిన కీలకమైన రహస్యం ఇప్పుడు నా గుప్పిటిలో ఉంది... అందుకే నేను తెచ్చిన సంబంధం చేసుకోమని అడిగితే కాదన లేక ఒప్పుకున్నాడు!..." నా కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. కోపంతో కుర్చీ లోంచి చివాలున లేచి నించున్నాను. "అంటే... యూ మీన్... మీరతన్ని బ్లాక్ మెయిలు చేస్తున్నారన్న మాట!" అన్నాను కోపంగా.

"మీరలాగ అనుకుంటే నాకభ్యంతరం లేదు" నాకింక అతనితో మాట్లాడడానికేమీ లేదనిపించింది. అతని ముఖం చూడ్డానికే రోతగా ఉంది. వస్తానని కూడా చెప్పకుండా అక్కడి నుండి విసురుగా వచ్చేసాను.

* * *

రాంబాబు పెళ్ళి శుభ లేఖలు యిచ్చి వెళ్ళాడు. పెళ్ళి రాయవరంలో. విషయం అంతు పట్టక పోయినా అతని పట్ల నాకు అమితమైన జాలి కలిగింది. మనిషి ముభావంగా ఉన్నాడు. విధిలేని పరిస్థితిలో పెళ్ళికి సిద్ధ పడినట్టుగా అతని వాలకమే చెబుతోంది.

ప్రభావతి పెళ్ళికి రాననేసింది. శలవు పెట్టి నేను ఒక్కడినీ బయలు దేరాను.

రాయవరం చిన్న వూరే. రిక్షా చేయించుకుని, పెళ్ళి వారింటికి వెళ్ళాను. పెళ్ళి సందడితో అక్కడంతా హడావిడిగా ఉంది. గుమ్మాలకి పచ్చ తోరణాలు కట్టేరు. ఇంటి ముందు తాటాకు పందిరి వేసారు. పందిట్లో కుర్చీలు వేసారు. ఓ ప్రక్క బేండు వాళ్ళు సిద్ధంగా ఉన్నారు. పిల్లలు కుర్చీల మధ్య నుండి ఒకర్నొకరు తరుముకుంటూ పరిగెడుతూ అల్లరి చేస్తున్నారు. పెద్దలు మందలిస్తున్నారు. అరుగు మీద పేకాట జోరుగా సాగుతోంది. వాళ్ళకి కాఫీలు అవీ సప్లయిలు బాగానే ఉన్నట్టుంది. మగ పెళ్ళి వారి విడిది ఎక్కడిచ్చారో కనుక్కుందామని ప్రక్కలకి చూస్తూ వుంటే, సుబ్రహ్మణ్యం కనిపించేడు. పెళ్ళి సందడంతా అతనిదే లాగుంది. అతన్ని చూస్తూ వుంటే నాకు వొంటి మీద తేళ్ళూ జెర్రెలూ పాకుతున్నట్టయింది. అతని వేపు ఓ సారి నిర్లక్ష్యంగా చూసి, తలెగ రేసాను. నా తిరస్కార

భావాన్ని గుర్తించి కూడా అతను నొచ్చుకున్నట్టు లేదు. "రండి!... నామీద మీకింకా కోపం పోయినట్టు లేదు!..." అన్నాడు నవ్వి. "అమాయికుడిని మోసం చేసి, మెడలు వంచి పెళ్ళి జరిపిస్తున్నారు కదా?..." అన్నాను వెటకారంగా. "వంద అబద్ధాలు ఆడయినా ఓ పెళ్ళి చెయ్యమన్నారు. నేను ఆడింది ఒక్క అబద్ధమే. చేసింది ఒక్క మోసమే - అదీ మీరు దాన్ని మోసం అనుకుంటే ..." అతని ముఖం మీద చిరు నవ్వు చెరగ లేదు. అలాంటి మోస గాడితో మాట్లాడడానికి నాకు మనసు అంగీకరించ లేదు. ఎదుటి మనిషి బలహీనతను దృష్టిలో ఉంచుకుని, దాన్ని ఆసరాగా చేసుకుని, అతని రహస్యాలని గుప్పెటలో ఉంచుకుని ఆడించే నీచ ప్రవృత్తికి అసహ్యం వేస్తోంది.

విసురుగా నేల మీద ఉంచిన బేగ్ భుజాన తగిలించుకుంటూ ప్రక్క నున్న వ్యక్తిని విడిది గురించి అడిగాను. అతను సమాధానం చెప్పే లోగా, "రండి ...రాంబాబు దగ్గరకి తీసికెళ్తాను.." అంటూ చొరవగా నా చంక నున్న బేగ్ లాక్కుని ముందుకి దారి తీసాడు సుబ్రహ్మణ్యం. అయిష్టంగా నయినా అతడిని అనుసరించక తప్ప లేదు. అన్యమనస్కంగా నడుస్తున్న నేను - "మూర్తి గారూ! వీరే రాంబాబుకి కాబోయే మామ గారు..." అంటున్న సుబ్రహ్మణ్యం మాటలతో ఉలిక్కి పడి చూసేను.

ఎదురుగా - విశ్వం మాష్టారు!

నాలో ఆశ్చర్యమూ, ఆనందమూ ముప్పిరిగొన్నాయి. నాచేత తొలిసారిగా అ ఆలు దిద్దించిన అమృత హస్తం వారిదే! చిన్నప్పుడెప్పుడూ వారి యింట్లోనే గడిపే వాడిని. మాష్టారు మా రాంబాబుకి మామ గారు కాబోతున్నారా! పెళ్ళి శుభలేఖ అనాసక్తంగా చదవకుండా పక్కన పడేసాను. చూసి వుంటే మాష్టారి పేరు చూసి, గుర్తించే వాడినేమో - కనీసం అనుమానమేనా వచ్చి రాంబాబుని వివరాలు అడిగి ఉండే వాడిని కదూ! "మాష్టారూ!... నేను మూర్తి నండీ... మీశిష్యుడ్ని... పార్వతీపురంలో మీ ప్రక్క యింట్లో ఉండే వాళ్ళం జగన్నాథంగారి రెండో అబ్బాయిని..." మాష్టారు తలెత్తి చూసేరు. పోల్చుకున్నట్టు లేదు. కానీ, అవే ప్రేమ పూరితమైన చూపులు... ఎప్పుడూ ఆశీర్వదిస్తున్నట్టుగా, అభిమానం, వాత్సల్యం ఉట్టి పడేలా! శిష్యుల శ్రేయస్సునే ఎప్పుడూ కోరుతున్నట్టుగా ఆ చల్లని చూపులు జీవితానుభవంతో నిండి పండిన ఆ ముఖం సౌజన్యానికి చిహ్నాం లాగా... కొద్దిగా వంగిన నడుమూ, ముతక ఖద్దరు పంచె... తోలు చెప్పులు... దళసరి కళ్ళద్దాలు ముక్కు మీదకి జారి పోతూ ...

ఆయన నన్ను గుర్తించారో, లేదో, కాని - "అలాగా బాబూ! అమ్మా నాన్నా బాగున్నారా!" అనడిగేరు. పెళ్ళి హడావిడిలో ఉన్నారు. తర్వాత తీరిగ్గా వారిని కలవాలి. "వస్తాను బాబూ... నువ్వు కాఫీ, టిఫినూ కానివ్వు..." అని వెళ్ళిపోయేరు. నా కళ్ళు ఆయనని యింత కాలానికి చూసినందుకు ఆనందంతో చెమరించాయి. "మాష్టారు మీకు తెలుసా?" సుబ్రహ్మణ్యం మాటలతో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చేను. విశ్వం మాష్టారిని చూసిన సంతోషంలో, సంభ్రమంతో మేము పార్వతీ పురంలో గడిపిన రోజులూ, మాష్టారి బడీ, యిల్లూ, కొబ్బరి తోటలో ఆటలూ - అన్నీ కలగాపులగంగా చెప్పేసాను. సంతోషంలో. ఆ సమయంలో నాకు సుబ్రహ్మణ్యం పట్ల అంత వరకూ ఉన్న వైముఖ్యం ఏమయి పోయిందో!

"మీకు నీల తెలుసు కదూ!..." నీల– అవునవును! మాష్టారి పెద్దమ్మాయి. "తెలుసు!" తలూపేను. సుబ్రహ్మణ్యం కళ్ళలో ఎందుకో నీళ్ళు తిరిగాయి. కలవర పడ్డాను.

"మీతో కొంచె మాట్లాడాలి... విడిది కెళ్ళి మీరు స్నానం చేసి, కాఫీ టిఫిన్లు పుచ్చుకున్నాక అలా కోవెల గట్టు వేపు వెళ్దాం ... మీరు రావాలి!..."

తలూపేను.

* * *

కోవెల గట్టు వాతావరణం ప్రశాంతంగా ఉంది. గుడిలో గంటలు ఉండి ఉండీ మ్రోగుతున్నాయి. కోవెల గోపురం మీద పావురాలు చప్పుడు చేస్తూ ఎగురుతున్నాయి. ప్రక్కన ఉన్న చెరువులో కొంగలు తెల్ల మబ్బులు ముక్కలుగా తెగి పడినట్టున్నాయి. ఇద్దరం మౌనంగా – వీలుగా వుండే చోటు చూసుకుని కూచున్నాం. సిగరెట్ వెలిగించాను. సుబ్రహ్మణ్యం తనకి అలవాటు లేదన్నాడు.

"చాలా సంవత్సరాలుగా మీకు విశ్వం మాష్టారి భోగట్టా లేవీ తెలీదు కదూ? నీల నెప్పుడో చిన్నప్పుడు చూసి ఉంటారు...." ఆ స్మృతులన్నీ క్రమంగా నా మనసులో మెదులుతూ ఉండడంతో మనసు ఆర్ద్రమయింది. అవునన్నట్టుగా తలూపేను.

"మన వాళ్ళు మాతా పితల తర్వాత గురువుకే పెద్ద పీట వేసి గౌరవించేరు. ఆచార్యుడు దేవుడన్నారు. కాని, సామాజిక మార్పులు రావడం, విలువలు మారడం, మనస్తత్వాలలోని విపరీత పోకడలు, అరుదుగా ఉపాధ్యాయ వృత్తి స్వీకరించిన వారి లోని వ్యక్తిత్వ లోపం – కారణాలేమయితే నేం!... గురు శబ్దానికి పూర్వపు ఔన్నత్యం, విలువ నశించి పోయేయి. ఉచ్ఛ నీచాలూ, అర్హతానర్హతలూ విస్మరించి అందర్నీ అదే గురు శబ్దంతో సంబోధించడం అలవాటయింది. పైపెచ్చు, గురూ అనే మాట అవహేళనకి ఆటపట్టయింది...." సుబ్రహ్మణ్యంలో ఆవేశం కట్టలు తెంచుకుంటోంది. అతని ఆవేశం చూసి, ఆశ్చర్య పోయేను. అతను చెబుతున్న దంతా వాస్తవమేనని అంగీకరించక తప్పదు.... కానీ, అతను యింతకీ రాంబాబు గురించి చెప్పదలుచుకున్న దేమిటో అవగతం కాక, అతని వేపు అయోమయంగా చూసేను. నా అభిప్రాయం గమనించని వాడిలా నా వేపు చూస్తూ అన్నాడు సుబ్రహ్మణ్యం: "రాంబాబు గజపతి నగరంలో మాష్టారు ఉండే రోజులలో అతని శిష్యుడు. ఈ రాంబాబు మరింత ముందుకి పోయి, గురుద్రోహం చేసాడు.. అతనిపట్ల, అతని కుటుంబం పట్ల తీరని అపచారం చేసాడు. ..."

ఉలిక్కి పడ్డాను. నా కళ్ళు ఆశ్చర్యంతో విప్పారాయి.

"అవునండీ మూర్తి గారూ – మాష్టారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, వాళ్ళింట్లో కలివిడిగా తిరిగే వాడు. రాంబాబు డిగ్రీ ఫైనలియరు చదివే రోజులలో నీలతో పరిచయం పెంచుకున్నాడు. గోవు మా లచ్చిమికన్నా అమాయకులైన మాష్టారి దంపతులు అతని నైచ్యాన్ని తెలుసుకో లేక పోయేరు. సహజంగానే ఆశ పడ్డారు. కానీ, పెళ్ళి ప్రసక్తి వచ్చే సరికి ఏవో కుంటి సాకులు చెప్పి తప్పించుకున్నాడు. ఆపిల్ల జీవితం బ్రద్దలయింది. మాష్టారి కుటుంబం అవమానంతోనూ. అశాంతితోనూ చితికి పోయింది. నీల ఆత్మ హత్య చేసుకుంది. అప్పటికామెకి నాలుగో నెల!..."

నాకు కాళ్ళ క్రింద భూమి కంపించి పోతున్నట్టయింది.

భగవాన్! జరిగిన ఈ విషాద సంఘటన నిజమేనా? నిజం కాక పోతే ఎంత బాగుండును! పచ్చగా నిత్య హరితంగా కళ కళలాడి పోయే మాష్టారి కుటుంబం, ఆ యిల్లూ, ఆ పుణ్య దంపతుల ఔన్నత్యమూ... అన్నీ గుర్తొచ్చి మనసు విల విలలాడి పోయింది. ఆ ఇంట పసుపు రాసిన గుమ్మాలు కూడా అందరినీ ఆదరంగా పిలుస్తున్నట్టే ఉండేవి. అరుస్తూ పిల్లకాయలకు పాఠాలు చెప్పే మాష్టారి గొంతు వాడ వాడకంతా ఎంతో నిబ్బరాన్నీ, ధైర్యాన్నీ కలిగించేది.

నాకు తెలీకుండానే నా కళ్ళు ధారాపాతంగా వర్షించ సాగాయి.

సుబ్రహ్మణ్యం నిట్టూర్చి అన్నాడు: "మాష్టారి కుటుంబానికి రాంబాబు వల్ల జరిగిన అన్యాయానికి వారి చిన్నమ్మాయి కల్యాణి పెళ్ళి పెద్ద సమస్య అయి పోయింది. రాంబాబు ఆ పిల్లని పెళ్ళి చేసుకోవడమే సరైన చర్యగా నేను భావించేను. నిజాని కది అతనికి సరైన శిక్ష కూడా అని నా భావన. అసలు మొదట్లో నీల ఆత్మ హత్య చేసుకున్నాక, పోలీస్ రిపోర్ట్ యిస్తానంటే మాష్టారు ఒప్పుకో లేదు. ఆ అన్యాయాన్ని కాలకూట విషంలా దిగ మ్రింగడానికే సిద్ధపడ్డారు... మొదట్లో రాంబాబు కల్యాణిని చేసు కునేందుకు సుతరామూ అంగీకరించ లేదు. ఎదురు తిరిగేడు. కాని నాచేతుల్లో అతనికి సంబంధించిన గుట్టు ఒకటి గుప్పెటలో ఉండడం చేత, నేను చెప్పాక – కల్యాణిని చేసుకునేందుకు అంగీకరించక తప్ప లేదు. ఇదీ జరిగింది. రాంబాబుని లొంగదీసుకో గలిగిన అస్త్రం నా చేతుల్లో ఏముందో చెప్పనా మూర్తి గారూ!..." అంటూ ఆగేడు. సుబ్రహ్మణ్యాన్ని నేను తప్పుగా అర్థం చేసుకున్నాను. అతని పట్ల నా ప్రవర్తనకి నాకే సిగ్గు వేసింది. మరింక ఆ రహస్యం వినాలన్న కుతూహలం కూడా నాకిప్పుడు లేదు. రాంబాబు పట్ల ఉండే కనీస సానుభూతి కూడా పూర్తిగా నాలో కరిగి పోయింది.

"ఇంత చెప్పాక, అది దాచడంలో అర్థం లేదు మూర్తి గారూ!... చెప్తాను వినండి... నేను యూనివర్సిటీలో ఉద్యోగిని కనుక నా చుట్టూ తిరిగే వాడు. బి.ఎ. ఫైనల్ పరీక్షలు రాసేక, తన రిజల్ట్ ఏమవుతుందోనని ఆందోళన పడుతూ తరుచుగా నన్ను కలుసుకుని అడుగుతూ ఉండే వాడు. అదే అవకాశంగా తీసుకో దలిచాను. అతను పరీక్ష తప్పేడని అబద్ధం చెప్పాను. అయితే, రికార్డులు తారుమారు చేసి, దొంగ మార్కుల జాబితా, సర్టి ఫికేటు ఇప్పించ గలనని చెప్పాను. ఆ ఆశతో నా చుట్టూ దేబిరిస్తూ తిరిగే వాడు. అలా తిప్పి త్రిప్పి, అతనికి మార్కుల మెమో, సర్టి ఫికేటు యిప్పించాను. నిజానికది ఫాల్స్ సర్టి ఫికేటు కాదు! అతను అత్తెసరు మార్కుల తో పరీక్ష గట్టెక్కాడు. కాని, మొదటి నుండీ అతన్ని పరీక్ష తప్పేడన్న భ్రమలోనే ఉంచాను. దాని వల్ల అతను వాటిని దొంగ మార్కుల మెమో గానూ, దొంగ సర్టిఫికేటు గానూ అను కుంటున్నాడు. ఆ తర్వాత అతని అదృష్టం బాగుండి, ఉద్యోగం కూడా వచ్చింది. తనవి ఫాల్స్ సర్టి ఫికెట్లు, మార్కుల జాబితా అని ఎప్పుడయినా బయట పడితే తక్షణం తన ఉద్యోగం వూడుతుందన్న భయం అతనిలో బలంగా నాటుకు పోయి ఉంది. నిత్యం ఆ భయంతోనే వణికి పోతూ ఉంటాడు. ఆ

సంగతి నాకు తెలుసు. అతనిని ఆ భ్రమలోనే - ఆ భయాల వూబిలోనే వుంచేను. ఈ రహస్యం నా కొక్కడికే తెలుసు కనుక నేను ఆడించినట్లల్లా ఆడక గత్యంతరం లేక పోయింది రాంబాబుకి. వాస్తవానికి కల్యాణితో పెళ్ళి విషయంలో తప్ప అతన్ని నేను మరే సందర్భంలోనూ యిబ్బంది పెట్ట లేదు. నిజానికి ఈ సంబంధం చేసుకుని తీరాలనీ, లేక పోతే తన రహస్యం బయట పెడతాననీ కూడా అతనిని నేను బెదిరించ లేదు కూడా!... అతనే ఆ ప్రమాదాన్ని నానుంచి శంకించి, తనంత తానుగాలొంగి వచ్చేడు... ఇప్పుడు చెప్పండి... మంచికో, చెడుకో యిలా ఒక వ్యక్తిని బెదిరించడం న్యాయం కాదు... కాని... నేను మధ్య వర్తిగా ఉండడం వల్ల నేనేమీ బెదిరించ కుండానే, తనే భయాందోళనలతో బెదిరి పోతూ, ఈ పెళ్ళికి అంగీకరించేడు. నేను చేసిందల్లా అవుననీ కాదనీ కూడా చెప్పకుండా మౌనంగా ఉండడమే!... ఇప్పుడు చెప్పండి మూర్తిగారూ! నేనింకా మీ కళ్ళకి బ్లాక్ మెయిలరు గానే కనిపిస్తున్నానా!..." అంటూ ముగించేడు సుబ్రహ్మణ్యం.

చప్పున అతని చేతిని నా చేతిలోకి తీసుకుని ఆప్యాయంగా నొక్కి వదిలాను. "మీరు నన్ను మన్నించాలి... మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నందుకు... రియల్లీ యూ ఆర్ గ్రేట్!..." అన్నాను మనస్ఫూర్తిగా.

* * *

"గురూ గారున్నారా!..." అంటూ గది లోకి దూసుకొచ్చి, కుర్చీ లాక్కుని నా ఎదురుగా కూలబడ్డాడు రాంబాబు... పెళ్ళయిన పది రోజులకి. "మోసం గురూ గారూ! పచ్చి మోసం!... మోసం జరిగి పోయింది... అంతా కుట్ర... దగా... వంచన!... ఆ సుబ్రమణ్యం గాడు లేడూ, వాడు మా మామ గారి దగ్గరి బంధువు అని చెప్పేను కదూ!... ఇవాళే తెలిసింది... వాడువాళ్ళ బంధువూ కాదు, వల్లకాడూ కాదు... వాడు ఎప్పుడో కొంత కాలం మా మామగారి దగ్గర శిష్యరికం వెలగ బెట్టాడుట!... ఎంత అబద్ధమో చూసారా! మోసం గురూ గారూ! లోకమంతా దగుల్బాజీ వెధవల్తో నిండి పోయింది..." అన్నాడు వగరుస్తూ.

పితృ ఋణం, మాతృ ఋణం అలాగే ఆచార్యుని ఋణం కూడా తీర్చు కోవడం అసాధ్యం. తన గురువు గారి ఋణాన్ని యిలా తీర్చుకోడానికి ప్రయత్నం చేసాడు- సుబ్రహ్మణ్యం. అతని జన్మ ధన్యం కాదూ!...

"అవునయ్యా, అంతా మోసవే... అంతా దొంగ వెధవలే!..." అన్నాను నవ్వుతూ. "కాదూ, మరి!" అన్నాడు రాంబాబు. వంటింట్లో - గ్లాసుల, ప్లేట్ల గల గల శబ్దం మధ్య మా ప్రభావతి నవ్వు కలిసి పోయి వినిపిస్తోంది!...

* * *

ఆంధ్ర భూమి మాస పత్రిక 1980 లో ప్రచురణ.